ఈ-పేపర్ తెలుగు డైలీ | 8PM

# ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/

**బుధవారం 12 ఆగస్టు 2026**

## రైస్ మిల్లర్ల గోల్‌మాల్‌పై
### సీఎం సీరియస్.. బకాయిలు కట్టకపోతే
# మిల్లులు సీల్!



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 12:**

రైస్ మిల్లర్ల గోల్‌మాల్, ప్రభుత్వానికి పెండింగ్ బకాయిలపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. సర్కారును బ్లాక్‌మెయిల్ చేయాలని చూస్తే ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. బకాయిలు కట్టకుండా డీఫాల్ట్ అవుతున్న మిల్లులను వెంటనే స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే స్వాధీనం చేసుకున్న మిల్లుల మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించేలా చూడాలని సూచించారు. మిల్లర్ల నుంచి బకాయిలు వసూలే టార్గెట్‌గా కొత్త పాలసీ తీసుకొస్తామని సీఎం స్పష్టం చేశారు.



గోల్నాక లంక బస్తీలో రాత్రికి రాత్రి వెలిసిన అక్రమ నిర్మాణం



లంక రోడ్డులో అక్కడే ఇటీవల కబ్జా చేసి కట్టిన షెడ్డు

# గోడలు లేపి..రేకులు కప్పి...."అప్నా జాగా" అంటూ దర్జా!

అంబర్ పేట మెయిన్ రోడ్డుకే జస్ట్ పది అడుగుల దూరం.. చుట్టూ కాస్లీ ఏరియా.. నైజాం కాలం నాటి దాదాపు 120 ఫీట్ల వరద నీటి నాలా.. కోట్ల రూపాయల విలువ చేసే సర్కారు భూమి.. ఇంతటి విలువైన జాగ కనిపిస్తే కబ్జా రాయుళ్ల కళ్లు ఊరుకుంటాయా..? ఏదైతే అదైందిలే.. ఎవడు అడుగుతడు?" అంటూ ఒకడు గోడలు లేపి.. రేకులు వేసిండు.. ఏకంగా ఇంటి నంబర్ కూడా తెచ్చుకున్నడు.."కబ్జా చేసుకో.. గోడ లేపుకో.. రేకులు వేసుకో.. ఇంటి నంబర్ తెచ్చుకో..అధికారులు ఒకరిపై ఒకరు నెట్టేసుకో..అనే కొత్త 'కబ్జా మోడల్' గోల్నాకలో పర్మినెంట్ అయిపోతుందేమోనని బస్తీ జనం సెటైర్లు పేలుస్తున్నారు..మరి సర్కారు జాగను కాపాడేది ఎవరు..నాలాను కాపాడేది ఎవరు..కబ్జాదారుల గోడలు కూల్చేది ఎవరు..మామూళ్ల మత్తులో ఉన్న అధికారులను మేల్కొలిపేది ఎవరు..?



బస్తీలో నైజాం కాలం నాటి 120 ఫీట్ల నాలా జాగా

**కూల్చుతారా.... నాన్చుతారా ..?**

- ముందోడు కబ్జా చేసిండు.. వెనకొచ్చినోడు "మై క్యా కమ్ హై?" అంటుండు.!
- ఒక్కడు చేసిందే ఫార్ములా..ఇంకోడు సేమ్ కాపీ కొట్టిండు
- కబ్జా కనిపిస్తే కళ్లు మూసుడు.....నోట్లు విసిరేస్తే చేతులు చాపుడు!
- మామూళ్ల మత్తులో ఆఫీసర్లు.. లీడర్లకు నోట్ల కట్టల మాల్ అలగ్..!
- నైజాం నాలా 120 ఫీట్లు.. కబ్జా కోరల్లో వందల గజాలు!
- వరద నీళ్ల దారి ఎటు పోయినా డోంట్ కేర్....కబ్జా జాగా మాత్రం వదలంరోయ్ !
- గతంలో జస్ట్ బ్రేక్.. గోల్నాకలో మళ్లీ "దందా దిల్‌సే షురూ!" లంక బస్తీకి రెవెన్యూ, ఐ
- జీహెచ్ఎంసీ, హైడ్రా ఎంట్రీ ఎప్పుడు సార్లూ..? కూల్చుతారా.... నాన్చుతారా ..?
- ఆఫీసర్ల యాక్షన్ ఎప్పుడు.. లేక "మాది కాదు" అంటూ ఖామోష్‌నా?

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, ఆగస్టు 12:**

**ముందోడు చూపిన దారి.. వెనకొచ్చినోడు అదే రూటు!**

అలీకేఫ్ చౌరస్తా నుంచి గోల్నాక వైపు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న లంకబస్తీ మైసమ్మ టెంపుల్ చౌరస్తా దగ్గర సర్కారు స్థలంపై కొంతకాలం క్రితం ఓ వ్యక్తి కన్నేశాడని స్థానికులు చెబుతున్నారు. దాదాపు 200 గజాలకు పైగా ఉన్న స్థలాన్ని చుట్టూ గోడలు లేపి, పైన రేకులు వేసి స్వాహా చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతటితో ఆగకుండా స్థానిక రాజకీయ నేతలు, సంబంధిత అధికారుల అండదండలు పొందుతూ.. చివరకు ఇంటి నంబర్ కూడా సంపాదించుకున్నారనే టాక్ బస్తీలో గట్టిగనే వినిపిస్తోంది.

**"ఆయన చేసిండు.. నేనేం తక్కువ?"**

ఇగ అసలు సినిమా ఇక్కడే స్టార్ట్ అయ్యింది..ముందోడు మెయిన్ రోడ్డుకు ఆనుకుని సర్కారు జాగను గోడలతో చుట్టేసి రేకులు వేసుకుంటే.. పక్కనే ఉన్న మరో పెద్దమనిషికి కూడా "మనోడికి అయినప్పుడు మనకెందుకు కాదు?" అన్న ఫీలింగ్ వచ్చిందో ఏమో కానీ.. ఇటీవల తన ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంపై గోడలు లేపి రేకులు వేసిండు. ముందోడి ఫార్ములా.. వెనకొచ్చినోడు కాపీ చేసిండు... పైగా అధికారుల చుట్టూ చక్కర్లు కొడుతూ.. ఇంటి నంబర్ కోసం ప్రయత్నాలు చేస్తున్నడని ఇదే ఇప్పుడు బస్తీలో హాట్ టాపిక్‌గా మారింది.

**నాలా ఉందా..? కబ్జాకు రెడ్ కార్పెట్ ఉందా..?**

ఇది మామూలు ఖాళీ జాగా కాదంటున్నారు స్థానికులు. నైజాం కాలం నాటి దాదాపు 120 ఫీట్ల వరద నీటి నాలా ఉండటంతో భవిష్యత్తులో భారీ వర్షాలు పడితే వరదనీటి ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. కానీ కబ్జాదారులకు మాత్రం నాలా కనిపిస్తలేదట.. కనిపించేది మాత్రం కాస్లీ సర్కారు జాగా నే నంట..

**మామూళ్ల మత్తులో మునిగిపోయారా..?**

ఇంత బహిరంగంగా గోడలు లేపుతున్నా.. రేకులు వేస్తున్నా.. నిర్మాణాలు పుట్టుకొస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం "మాకేం సంబంధం..?" అన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.కొందరు రాజకీయ పార్టీల లోకల్ లీడర్లను మచ్చిక చేసుకోవడం.. సంబంధిత అధికారుల చుట్టూ తిరగడం.. అందినకాడికి ముట్టజెప్పడం.. పని చక్కబెట్టుకోవడం అన్నది ఇక్కడ రివాజుగా మారిందనే చర్చ జరుగుతోంది.

**పార్టీ ఏదైనా.. కబ్జా ఒక్కటే పాలసీనా..?**

ఇక్కడ మరో ఇంట్రెస్టింగ్ టాక్ కూడా నడుస్తోంది. పార్టీ జెండాలు వేరైనా.. కబ్జా విషయంలో మాత్రం "అందరం ఒక్కటే" అన్నట్టుగా కొందరు లోకల్ నాయకులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ఇట్లుంటే....గతంలో కొంతకాలం గోల్నాక డివిజన్‌లో కబ్జాల జోరుకు బ్రేక్ పడినప్పటికీ.. ఇటీవల మళ్లీ పాత సీన్ రిపీట్ అవుతోందని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.ఒకడు గోడ లేపిండు..మరొకడు దాన్ని చూసి రేకులు వేసిండు..ఇంకొకడు ఇంటి నంబర్ కోసం పరుగులు పెడుతున్నడు.

**ఇదేనా నాలాల పరిరక్షణ..?..ఇప్పటికైనా 'యాక్షన్' ఉంటుందా..?**

ఇప్పటికైనా రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు ఈ ప్రాంతంపై దృష్టి సారించి.. అసలు స్థలం ప్రభుత్వానిదేనా.. నాలా పరిధిలోకే వస్తుందా.. నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా.. ఇంటి నంబర్లు ఎలా వచ్చాయి.. అనే అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.. రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు రంగంలోకి దిగుతరా.. లేక "మాది కాదు.. వాళ్లది" అంటూ చేతులెత్తేస్తరా సూడాలె మరి.!

## జంతర్ మంతర్ కాడ టీడబ్ల్యూజేఎఫ్ ధర్నా లొల్లి...
### జర్నలిస్టుల డిమాండ్లపై కదిలిన ఢిల్లీ!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, ఆగస్టు 12**

: ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర టీడబ్ల్యూజేఎఫ్ నిర్వహించిన జర్నలిస్టుల ధర్నాకు కేంద్రం ఎట్టకేలకు రెస్పాండ్ అయ్యింది. జర్నలిస్టుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, రైల్వే రాయితీ, రక్షణ చట్టం, పెన్షన్ తదితర డిమాండ్లపై ఇచ్చిన వినతిపై కేంద్రం చర్యలు మొదలుపెట్టింది. టీడబ్ల్యూజేఎఫ్ ఫిర్యాదును పరిశీలించి త్వరగా పరిష్కరించాలంటూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆగస్టు 8న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు లెటర్ రాసింది. రైల్వే రాయితీ అంశంపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి కూడా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు. జర్నలిస్టుల సమస్యలు జట్ పట్ గ క్లియర్ చేయాలని కోరారు.



**మేడిగడ్డ కేసులో మరో ట్విస్ట్.. కేసీఆర్‌కు మళ్లీ సమన్లు..!**

2 లో



**జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన**

2 లో



**నీట్ పేపర్ లీక్‌పై విపక్షాల రచ్చ.. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కీలక ప్రకటన**

2 లో




**ఇంతకాలం ఆడోళ్ల గౌరవం.. ఇప్పుడు మగోళ్ల వంతు! బస్టాండ్‌లో బోర్డు చూసి జనాల నవ్వులు!**

3 లో



## కరాటే కిర్రాక్ ఫీట్..
### జీవీఆర్ విజేతలకు గ్రాండ్ గ సన్మానం!

**ఇయ్యాల్టి న్యూస్, కాచిగూడ, ఆగస్టు 12**

బెంగళూరు కరాటే టోర్నీలో సత్తా చాటిన జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులకు అదనపు డీసీపీ మహమ్మద్ బుర్హాన్ అలీ, ఏసీపీ జి. రణవీర్ రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందించి ఘనంగా సన్మానించారు. 24 మంది విద్యార్థులు ఏకంగా 38 ప్రథమ, 10 ద్వితీయ స్థానాలు సాధించడం విశేషం.కానిస్టేబుల్, కరాటే విద్యార్థి వి.సుధాకర్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. 'మిషన్-80'లో 80 షాబాద్ టైల్స్‌ను 9 టెక్నిక్స్‌తో 3.06 నిమిషాల్లో బ్రేక్ చేసిన సుధాకర్‌ను అతిథులు అభినందించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి స్పోర్ట్స్‌పై ఫోకస్ పెట్టాలని ఏసీపీ రణవీర్ రెడ్డి సూచించారు. డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, బ్లాక్ బెల్ట్‌లు, కోచ్‌లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌పై చీకటి లొల్లి.. లైట్లు వెంటనే సెట్ చేయాలి: బీఆర్ఎస్ నేత ఎర్రబోలు!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, ఆగస్టు 12:**



అంబర్‌పేట్ ఫ్లైఓవర్ చే నంబర్ నుంచి శ్రీ రమణ థియేటర్ చౌరస్తా దాకా రాత్రిపూట సరైన స్ట్రీట్ లైట్లు లేక జనం, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబోలు నరసింహారెడ్డి అన్నారు. రోడ్డు మొత్తం చీకటిగా ఉండటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందన్నారు. బోనాల టైంలో మహంకాళి గుడికి భక్తుల రాకపోకలు పెరిగిన నేపథ్యంలో పరిస్థితి మరింత ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులు ఇక ఆలస్యం చేయకుండా వెంటనే లైట్లు ఏర్పాటు చేసి ప్రజల భద్రతకు భరోసా ఇవ్వాలని రెడ్డి సాబ్ డిమాండ్ చేసిండు.

## 'హర్ ఘర్ తిరంగా'
### ఇంటిమీద త్రివర్ణ పతాకం.. హర్ ఘర్ తిరంగాలో కృష్ణ యాదవ్ సార్ ఫ్యామిలీ జోష్!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, ఆగస్టు 12**



: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి కృష్ణ యాదవ్, ఆయన కుమారుడు వంశీ కృష్ణ యాదవ్ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగరేశారు. ఆగస్టు 13 నుంచి 15 వరకు జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు.

## హోంగార్డులకు వింటర్ జాకెట్లు.. చలిలో డ్యూటీకి 'వెచ్చని' భరోసా!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, ఆగస్టు 12:**



హైదరాబాద్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు సిటీ హెడ్‌క్వార్టర్స్‌లో వింటర్ జాకెట్లు పంపిణీ చేశారు. డీసీపీ హెడ్‌క్వార్టర్స్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హోంగార్డులందరికీ జాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ, సిటీ కమాండెంట్ కిష్టయ్య, ఏసీపీలు కృష్ణ, రవి, ఆర్ఐ వెల్ఫేర్ నరసింహగౌడ్, తెలంగాణ హోంగార్డ్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ హనుమంత్‌రెడ్డి, సీనియర్ హోంగార్డులు, మహిళా హోంగార్డులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ అండ.. రూ.2 లక్షల లెటర్ అందజేత

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, ఆగస్టు 12:**



కాచిగూడ మోతీ మార్కెట్‌కు చెందిన భాగ్యలక్ష్మి వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల విలువైన ఎల్‌వోసీని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, మెరుగైన వైద్యం అందేలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్నోళ్లకు అండగా నిలవడమే తన బాధ్యతని ఎమ్మెల్యే కాలేరు తెలిపారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/





# ఇమ్రాన్ ఖాన్ మృతి.?
## పాక్ జర్నలిస్ట్ సంచలన వ్యాఖ్యలు..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12

పాకిస్థాన్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ అధినేత ఇమ్రాన్ ఖాన్ మృతి చెందారని పాకిస్తాన్ వ్యాప్తంగా ప్రచారం మొదలైంది. అవినీతి ఆరోపణలపై రావల్పిండిలోని అడియాల జైలులో ఉన్న ఆయన కన్నుమూసినట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికాలో ఉంటున్న పాకిస్తానీ జర్నలిస్ట్ వజాహత్ సయీద్ ఖాన్ ఈ వ్యాఖ్యలు చేయడంతో పాక్ వ్యాప్తంగా ఆందోళనలు పెరిగాయి. రావల్పిండిలోని పాకిస్తాన్ ఆర్మీ జనరల్ హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ సైనికాధికారులు ఇమ్రాన్ ఖాన్ ఇక బతికి ఉండకపోవచ్చని భావిస్న?న్నారని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ ముగ్గురు స్వయంగా చూసి నిర్ధారణకు రాలేదని స్పష్టం చేశారు.



# నీట్ పేపర్ లీక్‌పై విపక్షాల రచ్చ..
## కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కీలక ప్రకటన

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12:

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఉభయ సభల్లో ప్రతిపక్షాల నిరసనలు, నినాదాల హోరు మళ్లీ కొనసాగడంతో లోక్‌సభ రేపటికి వాయిదా పడింది. విపక్ష ఎంపీల తీవ్ర గందరగోళం మధ్య సభను నడపడం సాధ్యం కాకపోవడంతో స్పీకర్ ఓం బిర్లా సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. అయితే, అంతకు మందు సభలో ప్రతిపక్షాల నిరసనలపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నీట్ పేపర్ లీక్ అంశంపై కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా చర్చించడానికి పూర్తిగా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు సభలో శాంతియుతంగా, నినాదాలు ఆపి సహకరిస్తే తక్షణమే నీట్ పేపర్ లీక్ అంశంపై సమగ్రంగా చర్చ చేపడతామని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా సభలో స్పందించడానికి, ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానమివ్వడానికి సిద్ధంగా ఉన్నారని రిజిజు తెలిపారు.

# మేడిగడ్డ కేసులో మరో ట్విస్ట్.. కేసీఆర్‌కు మళ్లీ సమన్లు..!

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 12:



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సంచలనం సృష్టిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ కేటగిరీ కేసు విచారణను జిల్లా కోర్టు వచ్చే నెల సెప్టెంబర్ 9వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో అసలు పిటిషనర్ రాయలింగమూర్తి మృతి చెందడంతో, విచారణను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రక్రియను కొనసాగించాలని హైకోర్టు సూచించింది. అంతేకాకుండా ఈ వివాదాన్ని జిల్లా కోర్టు పరిధిలోనే పరిష్కరించుకోవాలని ఉన్నత నాయస్థానం స్పష్టం చేసింది. అయితే ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సమన్లు ఇంకా అందకపోవడంతో, ఆయనకు మరొకసారి సమన్లు పంపించాల్సిందిగా జిల్లా న్యాయవాదిని కోర్టు ఆదేశించింది. నేడు కేసుపై తుది నిర్ణయం లేదా తీర్పు వెలువడే అవకాశం ఉండటంతో హైదరాబాద్ నుంచి ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులు, అలాగే మాజీ మంత్రి హరీశ్‌రావు తరపు న్యాయవాదులు ప్రత్యేకంగా జిల్లా కోర్టుకు హాజరయ్యారు. ఉదయం నుంచి తీవ్ర ఉత్కంఠ నెలకొన్నప్పటికీ, న్యాయస్థానం విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో తదుపరి విచారణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.




# క్రూడ్ పైపైకి.. సూచీలు కిందికి

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12:** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరే అవకాశాలు సన్నగిల్లుతుండటం తో ముడి చమురు ధరలు మళ్లీ 90 డాలర్ల దిశ గా పయనిస్తున్నాయి. అంతర్జాతీయంగా ఇయ్యాల ఈక్విటీ మార్కెట్లలో ట్రేడింగ్ సెంటిమెంట్‌ను ఇది దెబ్బతీసింది. ఈ కారణంగా భారత ప్రామాణిక ఈక్విటీ సూచీలూ మంగళవారం నష్టాల్లో పయనించాయి. సెన్సెక్స్ ఒక దశలో 494 పాయింట్ల మేర క్షీణించినప్పటికీ,

చివరికి 388.19 పాయింట్ల నష్టంతో 78,154.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 112.10 పాయింట్లు పతనమై 24,471.70 వద్దకు జారుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 2 శాతానికి పైగా ఎగబాకి 89.63 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. దేశీయంగా పసిడి ధరలు వరుసగా ఆరో రోజూ ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర మరో రూ.1,200 పెరుగుదలతో రూ.1,57,200కు చేరింది.

# మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నడు: కేటీఆర్

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 12:



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన విమర్శల దాడిని మరింత ఉద్ధృతం చేశారు. సీఎం సోదరుడికి సంబంధముందని ఆరోపిస్తున్న టెస్సారక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపుల విషయంలో రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 'అనుముల హబ్స్' ఏర్పాటులో బిజీగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు బుధవారం ఈ అంశంపై 'ఎక్స్' వేదికగా కేటీఆర్ స్పందించారు.

## జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12:



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటి తరం యువతకు పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు.

## బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం : మంత్రి పొన్నం

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 12:



బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక వృద్ధి సాధించే లక్ష్యంతో తమ ప్రభుత్వం కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందించే పథకాన్ని గురువారం సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను బీసీ మహిళలకు అందించనున్నట్లు చెప్పారు.

# హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గంజాయి వినియోగం..
## ఈగల్ దాడుల్లో 17 మంది విద్యార్థులకు పాజిటివ్




ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12:

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంగణంలో మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై తెలంగాణ 'ఈగల్' టీమ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించారు. క్యాంపస్ లోపల గంజాయి వినియోగిస్తున్నారనే పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన అధికారులు, అనుమానితులైన పలువురు విద్యార్థులకు క్షేత్రస్థాయిలో డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఏకంగా 17 మంది విద్యార్థులకు గంజాయి పాజిటివ్‌గా నిర్ధారణ కావడం తీవ్ర కలకలం రేపింది. ఈ తనిఖీల క్రమంలో వర్సిటీలో అక్రమంగా మత్తుపదార్థాలు సరఫరా చేస్తున్న ఒక ప్రధాన డ్రగ్ పెడ్లర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసోం

రాష్ట్రం నుంచి గంజాయిని అక్రమంగా తీసుకువచ్చి, యూనివర్సిటీ విద్యార్థులకు గ్రాము రూ.500 చొప్పున విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో నిందితుడు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై పోలీసు యంత్రాంగం, ఈగల్ టీమ్ తదుపరి విచారణను వేగవంతం చేశాయి



## రాజ్యసభలో 'లుంగీవాలా' వివాదం.. బీజేపీ ఎంపీపై సీపీఐఎం ఎంపీ ఫిర్యాదు

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12:

రాజ్యసభ సాక్షిగా తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్‌పై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. ఈ మేరకు రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల ఇన్కమ్ టాక్స్ (సవరణ) ఆర్డినెన్స్, 2026పై రాజ్యసభలో చర్చ జరుగుతున్న సమయంలో, సభను ఉద్దేశించి జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతుండగా బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ తనను లక్ష్యంగా చేసుకుని కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలను(లుంగీవాలా అంటూ) పదేపదే ఉపయోగించారని బ్రిట్టాస్ ఆరోపించారు. దక్షిణ భారతదేశానికి చెందిన ప్రజలను చిన్నచూపు చూసేలా, వారి సంస్కృతిని, ఐడెంటిటీని అవమానించే పదాలను ఆమె వాడారని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.



## అదానీకి అమెరికా కోర్టులో ఊరట.. ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ ఆగ్రహం..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12:

ప్రముఖ భారత వ్యాపారవేత్త గౌతమ్ అదానీపై నమోదైన క్రిమినల్ కేసును అమెరికా కోర్టు కొట్టివేయటంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీపై సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేశారు. అమెరికా కోర్టు గౌతమ్ అదానీపై కేసును కొట్టి వేయటం వెనుక.. పైకి కనిపిస్తున్న దానికంటే ఎక్కువ విషయమే ఉందని అన్నారు. ప్రధాన మంత్రి లొంగిపోయి.. భారతదేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం తన ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీ ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'దీని వెనుక పైకి కనిపిస్తున్న దానికంటే చాలా ఎక్కువ విషయం ఉంది. ప్రధాన మంత్రి లొంగిపోయారు. భారతదేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారు. భారతదేశం భారీ మూల్యాన్ని చెల్లించుకుంటోంది' అని రాసుకొచ్చారు.

# ఆ స్థానాలే కొనసాగించాలి..
## డీలిమిటేషన్‌పై అసెంబ్లీలో విజయ్ తీర్మానం

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12:



డీలిమిటేషన్ వ్యవహారంపై దక్షిణాది రాష్ట్రాలు గగ్గోలు పెడుతూనే ఉన్నాయి.. ఎన్డీఏ పక్ష పాలిత రాష్ట్రాలు తప్ప.. మిగతా రాష్ట్రాలు మొత్తం.. ఈ వ్యవహారాన్ని తప్పుబడుతున్నాయి.. అయితే, డీలిమిటేషన్ అంశంపై తమిళనాడు సీఎం విజయ్ అసెంబ్లీలో కీలక తీర్మానం ప్రవేశపెట్టారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతమున్న 543గానే కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 2026 జనాభా లెక్కల ఆధారంగా వెంటనే డీలిమిటేషన్ చేపట్టవద్దని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయ అన్యాయం జరగకుండా చూడాలని సీఎం విజయ్ కేంద్రాన్ని కోరారు.

## 'ప్రహార్' వ్యూహం దశలవారీ అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: కేంద్ర హోంశాఖ

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12:




భారతదేశపు మొట్టమొదటి సమగ్ర జాతీయ ఉగ్రవాద నిరోధక విధానం 'ప్రహార్' వ్యూహాన్ని దశలవారీగా, ప్రగతిశీల పద్ధతిలో అమలు చేయడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి కేంద్రం తెలిపింది. ఈ మేరకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధవారం పార్లమెంటుకు చెప్పింది. ఉగ్రవాద కార్యకలాపాలు, తీవ్రవాదాన్ని నిరోధించడానికి, ఎదుర్కోవడానికి ఈ వ్యూహం ప్రభుత్వ, సమాజ సమగ్ర విధానాలతో ఒక జాతీయ ఉగ్రవాద నిరోధక ఫ్రేమ్?వర్క్?ను అందిస్తుందని వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 23న ఆవిష్కరించిన ఈ 'ప్రహార్' వ్యూహం ఏడు ముఖ్యమైన అంశాలపై ఆధారపడి ఉందని కేంద్ర హోంశాఖ తెలిపింది. రాజ్యసభలో కొందరు ఎంపీలు అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానమిస్తూ ఈ వివరాలను వెల్లడించారు.

## నీట్ పేపర్ లీక్ వివాదం- 13 మందిపై 20వేల పేజీలతో ఢిల్లీ కోర్టులో సీబీఐ ఛార్జ్‌షీట్

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12:




నీట్- యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ దాఖలు చేసిన అభియోగపత్రాన్ని ఢిల్లీ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. 13 మంది నిందితులపై దర్యాప్తు సంస్థ సమర్పించిన ఛార్జ్‌షీట్‌ను ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అజయ్ గుప్తా పరిగణనలోకి తీసుకున్నారు. పేపర్ లీక్‌లపై విచారణకు ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఇటీవలే సీబీఐ తుది ఛార్జ్ షీట్‌ను వేసింది. 13 మంది నిందితులపై 20వేల పేజీలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అభియోగాలపై గురువారం నుంచి వాదనలు వింటామని న్యాయస్థానం తెలిపింది. ఈ సందర్భంగా మీడియా ప్రచురిస్తున్న పేర్లలో కొందరు సాక్షులు మైనర్లు ఉండొచ్చని ఛార్జిషీటులోని కొన్ని భాగాలను పత్రికల్లో నిరంతరం ప్రచురిస్తున్నారని కోర్టుకు సీబీఐ తెలియజేసింది.

ట్రెండింగ్, క్రైం
ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/

# దుల్కర్ 'ఐయామ్ గేమ్'కు బ్రేక్..

## రిలీజ్ డేట్‌పై జోరుగా టాక్!




**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 12:** మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తున్న 'ఐయామ్ గేమ్' మూవీకి రిలీజ్ వాయిదా పడే ఛాన్స్ ఉందంటూ టాక్ నడుస్తోంది. ఆగస్టు 20న ఓణం కానుకగా రావాల్సిన ఈ సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ పనులు ఆలస్యం కావడమే కారణమట. పైగా బాక్సాఫీస్ బరిలో 'ఖలీఫా', 'బెత్లెహెం కుటుంబ యూనిట్', 'టాక్సిక్' లాంటి సినిమాలతో గట్టి పోటీ ఉండటంతో.. సోలో రిలీజ్ డేట్ కోసం మేకర్స్ చూస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మరి ఈ వాయిదా వార్త నిజమా.. గాసిప్పా అనేది సూడాలె!








## సిద్ధార్థ్ వెబ్ సిరీస్‌పై వివాదం..
## జెండా సీన్‌తో రచ్చ రచ్చ!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 12:** సిద్ధార్థ్, జిమ్మీ షేర్‌గిల్, దియా మీర్జా నటించిన 'ఆపరేషన్ సఫేద్ సాగర్' వెబ్ సిరీస్ చిక్కుల్లో పడింది. కార్గిల్ యుద్ధం నేపథ్యంలో తెరకెక్కిన ఈ సిరీస్‌లో జాతీయ జెండా కప్పిన తీరు సరిగా లేదంటూ శౌర్య చక్ర గ్రహీత, మాజీ కల్నల్ వేంబు శంకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సీన్‌ను డిజిటల్‌గా సరిచేసే వరకు నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ ఆపాలని, మేకర్స్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో సోషల్ మీడియాలో 'బ్యాన్ చేయాలె' అంటూ నెటిజన్లు రచ్చ చేస్తున్నారు.



### బీచ్ బ్యూటీలో షిర్లీ సెటియా..
## గ్రీన్ లుక్‌తో కిర్రాక్ జలక్!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 12:**

ఆలివ్‌గ్రీన్ బీచ్‌వేర్‌లో షిర్లీ సెటియా అదిరిపోయే లుక్‌లో మెరిసింది. పైగా వైట్-గ్రీన్ టైడై షర్ట్ కప్పుకుని.. గడ్డికప్పు కింద చెక్క డెక్‌పై స్టైలిష్‌గా పోజిచ్చింది. అమ్మడి ట్రాపికల్ లుక్ చూసి నెటిజన్లు వావ్ అంటున్నారు..

### రోజ్‌గోల్డ్‌లో అన్వేషి జైన్ జలక్..
## చూపులతోనే షేక్!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 12:**

రోజ్‌గోల్డ్ డ్రెస్‌లో అన్వేషి జైన్ అదిరిపోయే లుక్‌లో మెరిసింది. మెరుపులా మెరిసే క్రాప్ టాప్, హై-వెయిస్టెడ్ స్కర్ట్‌తో స్టైలిష్‌గా పోజిచ్చింది. వాలిపోతున్న లాంగ్ హెయిర్, కాన్ఫిడెంట్ లుక్‌తో.. అమ్మడి గ్లామర్‌కి నెటిజన్లు ఫిదా అవుతున్నారు!



## నల్లచీరలో నువేక్ష నయగారం..
## బాల్కనీలో హొయలే హొయలు!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 12:**

మెరిసే నల్లచీరలో నువేక్ష సొగసులు అదుర్స్ అనిపించాయి. గోల్డ్ సీక్విన్స్, అద్దాల వర్క్‌తో మెరిసే బ్లౌజ్‌లో.. బాల్కనీలో భుజం మీదుగా వెనక్కి తిరిగి ఇచ్చిన పోజు ఫుల్‌గా ఆకట్టుకుంది. సింపుల్ లుక్‌కే స్టైలిష్ టచ్ ఇచ్చి.. నువేక్ష నయగారం నెట్టింట్లో దుమ్మురేపుతోంది.



### జీబ్రా లుక్‌లో రోష్ని వాలియా..
## నవ్వుతోనే కిర్రాక్ షో!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 12:**

బ్లాక్-వైట్ జీబ్రా ప్రింట్ క్రాప్ టాప్‌లో రోష్ని వాలియా స్టైలిష్‌గా మెరిసింది. గోల్డ్ ఇయర్‌రింగ్స్, వేవీ హెయిర్‌తో అదిరిపోయే లుక్‌లో కనిపిస్తూ.. చిరునవ్వుతో నెటిజన్ల చూపంతా తనవైపే తిప్పుకుంది.



## సంగారెడ్డి రోడ్లపై రక్తపాతం..
### రెండు ప్రమాదాల్లో 9 మంది మృతి!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12:**

సంగారెడ్డి జిల్లాలో వరుస రోడ్డు ప్రమాదాలు దడ పుట్టించాయి. మొగడంపల్లి మండలం సత్వార్ దగ్గర కూలీలతో వెళ్తున్న ఆటోను ట్యాంకర్ ఢీకొట్టడంతో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో జహీరాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆటోలో మొత్తం 14 మంది ఉన్నట్లు సమాచారం. ఇక కోహిర్ మండలం కవేలి వద్ద మరో కారు అదుపుతప్పి వాహనాలపై దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. రెండు ప్రమాదాల్లో కలిపి 9 మంది ప్రాణాలు కోల్పోవడంతో సంగారెడ్డి రహదారులు రక్తసిక్తమయ్యాయి. పోలీసులు ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భర్తకు షాక్.. అర్ధరాత్రి కండక్టర్‌తో భార్య జంప్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12:**



మలయాళ యూట్యూబర్ అఖిల్ ఎన్ఆర్‌డీకి ఊహించని షాక్ తగిలింది. ప్రేమించి పెళ్లాడిన భార్య మేఘ అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. కండక్టర్‌తో కలిసి ఆమె వెళ్లిన సీసీటీవీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చదువుకునే సమయంలో పరిచయమైన అఖిల్--మేఘ 2024లో పెళ్లి చేసుకున్నారు. మేఘ కోర్సు కోసం బస్సులో వెళ్తున్న క్రమంలో కండక్టర్‌తో పరిచయం ఏర్పడి.. అది ప్రేమగా మారిందనే ప్రచారం నడుస్తోంది. అతనికి ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం రావడంతో మేఘ అతనితో వెళ్లిపోయిందని సోషల్ మీడియాలో కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే మేఘ మాత్రం తమ బంధంలో వేధింపులు, భర్తకు ఇతర మహిళలతో సంబంధాలే తాను ఇల్లు వదిలి వెళ్లడానికి కారణమని చెప్పినట్లు సమాచారం. అసలు కథ ఏంటనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## విమానంలో గంజాయి కలకలం.. పైలట్ టెస్ట్‌లో షాక్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12:**




ఫుకెట్--ఢిల్లీ ఎయిర్ ఇండియా విమానం ఒక్కసారిగా 300 అడుగుల ఎత్తు కోల్పోయి 24 మందికి గాయాలైన ఘటనలో కొత్త ట్విస్ట్ బయటపడింది. కెప్టెన్ మత్తులో ఉన్నాడని ఓ ప్రయాణికుడు ఆరోపించగా.. పరీక్షల్లో గంజాయి ఆనవాళ్లు గుర్తించినట్లు సమాచారం. ఇద్దరు పైలట్లను డ్యూటీ నుంచి తప్పించినట్లు తెలుస్తోంది. అసలు కారణమేంటో ఏఏఐబీ దర్యాప్తులో తేలాలె!

## ఇంతకాలం ఆడోళ్ల గౌరవం.. ఇప్పుడు మగోళ్ల వంతు!
## బస్టాండ్‌లో బోర్డు చూసి జనాల నవ్వులు!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 12:**



సూర్యాపేట కొత్త బస్టాండ్‌లో టీజీఎస్ఆర్టీసీ పెట్టిన ఓ బోర్డు ఇప్పుడు ఫుల్‌గా వైరల్ టాక్ అయింది. ఇంతకాలం 'స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం' అంటూ బోర్డులు కనిపించగా.. ఇప్పుడు 'పురుషులను గౌరవించడం మన సంప్రదాయం.. వారికి కేటాయించిన సీట్లలో వారినే కూర్చోపెట్టండి' అంటూ దర్శనమిచ్చింది. దీంతో ప్రయాణికులు 'ట్రెండ్ మారింది గురూ.. బోర్డు కూడా మారింది!' అంటూ సరదాగా నవ్వుకుంటున్నారు. సీట్లు ఎవరి కోసం కేటాయించారో వారికే వదిలేయాలన్న మెసేజ్ మాత్రం క్లియర్‌గా ఉంది!

ON BEHALFOF RRR MEDIA PVT LIMITED ..2-3-606/49/4.. PATELNAGER.. AMBER PET, HYDERABAD, TELNGANA.. 500013,
EDITOR: RAMANRAJU RATHNA, RNI NO TG/2024/1093.. email:ramannews9@gmail.com..phon 9949152838, 7013794396